క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 8 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

దాడులను అరికట్టాలి

సంగారెడ్డి టౌన్: దళితులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా.. షాబాద్ మండల పరిధిలోని కేసారం గ్రామంలో ఏడో తరగతి చదువుతున్న దళిత బాలుడు యాదగిరిని చెట్టుకు కాసిన జామకాయలను తెంపుకున్నాడని దౌర్జన్యానికి పాల్పడిన మధుసూదన్ రెడ్డి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. .

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

హత్నూర(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని మాధుర శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నే దత్తయ్య ఎప్పటిలాగే గొర్రెలను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సర్వీస్ వైర్ తెగిపోవడంతో గొర్రెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు దత్తయ్య కోరుతున్నాడు.

పాఠ్యపుస్తకాల అమ్మకంపై ఏబీవీపీ నాయకుల నిరసన

జహీరాబాద్: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల అమ్మకాన్ని నిరసిస్తూ ఏబీవీపీ నాయకులు ఆయా పాఠశాలల వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్ మాట్లాడుతూ నారాయణ, మాస్టర్ మైండ్ పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు మేరకు మాస్టర్ మైండ్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేసినట్లు ఎంఈఓ బస్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, నాని పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించండి

నారాయణఖేడ్: సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులను నియమించాలని గురుకులం పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజునాయక్ ఆధ్వర్యంలో గురుకులాల ఆర్సీవో భీమయ్యకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. 600 విద్యార్థులకు గాను 40 మంది బోధనా సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారన్నారు. మిగతావారు పార్ట్ టైంగా పనిచేస్తున్న వారు కాగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు వారిని విధుల్లోకి తీసుకోలేదన్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ సైతం లేరని తెలిపారు. వినతి పత్రం అందజేసినవారిలో సభ్యులు నర్సాపూర్ శంకర్, నర్సింహులు ఉన్నారు.


ఉపాధ్యాయురాలికి సన్మానం



శ్యామల దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు శ్యామలను పీఆర్టీయూ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభు, మండల అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ హెచ్‌ఎం వెంకటేశం, పీఆర్టీయూ నాయకులు శ్రీశైలం, చంద్రు, చిట్టి బాబు శ్రీదేవి పాల్గొన్నారు.

బీసీ గురుకుల విద్యాలయంలో...



హరీశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయంలో పీజీటీ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న హరీశ్వర్‌రెడ్డి దిగ్వాల్ విద్యాలయాలనికి ప్రిన్సిపాల్‌గా పదోన్నతిని పొంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

గ్రహణం వీడేనా?

- అభివృద్ధికి నోచుకోని గౌసాబాద్ చెరువు
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన వైనం
- నామమాత్రంగా పనులు ప్రారంభించి చేతులు దులుపుకున్న అధికారులు
- 16 ఏళ్ల క్రితమే రూ.73.70 లక్షల నిధులు మంజూరు
- నేటికీ పూర్తికాని చెరువు పనులు

నిజాంకాలం నాటి చెరువు అది.. అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా దెబ్బతిని నిర్లక్ష్యాన్ని గురైంది. అయితే చెరువును పంటల సాగుకు అనువుగా మార్చేందుకు అప్పట్లో నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి నాటి ప్రభుత్వానికి పంపించగా నిధులు మంజూరయ్యాయి. చెరువుకట్ట, అలుగు పనులు చేపట్టిన తరువాత ఏ కారణంతో చేతనో గాని పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అయితే చెరువు పనులను పూర్తి చేసేందుకు ఇప్పటివరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపడంలేదు. ఫలితంగా చెరువు అభివృద్ధికి నోచుకోకుండా పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది.

– జహీరాబాద్ టౌన్



మాజీ మంత్రి గీతారెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



ముళ్లపొదల మధ్యలో గౌసాబాద్ చెరువు కట్ట

జహీరాబాద్ మండల పరిధిలోని గౌసాబాద్, ఔరంగనగర్ గ్రామ శివారులో నిజాం కాలంలో చెరువును నిర్మించారు. 186 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువు అభివృద్ధికి నోచుకోక పిచ్చిమొక్కలు నిండిపోయింది. పూర్తిగా దెబ్బతిన్న చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్ద పెద్ద పొదలతో దర్శనమిస్తోంది. అయితే చెరువు విషయాన్ని అప్పటి ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి గీతారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె చొరవ తీసుకొని చెరువును మరమ్మతులతో పటిష్టం చేసేందుకు నిర్ణయించి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు రూపొందించి పంపగా 2008లో రూ.73.70లక్షలు మంజూరయ్యాయి. 2010 డిసెంబర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్న గీతారెడ్డి చెరువు పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఏడాది తర్వాత సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. చెరువు కట్ట పెంచడంతో పాటు అలుగు, కాలువ పనులను మాత్రమే చేపట్టారు.

పరిహారం కోసం ఫిర్యాదు

చెరువు కాలువ నిర్మాణంతో సుమారు 50ఎకరాల భూమిని సమీపంలోని రైతులు కోల్పోవాల్సి వచ్చింది. అయింతే ముందస్తు సమాచారం, నోటీసులు జారీ చేయలేదు. పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడంతో రైతులు కాలువ పనులకు అభ్యంతరం తెలిపారు. పరిహారం చెల్లించేతవరకు కాలువ పనులు చేపట్టవద్దంటూ నీటిపారుదల శాఖ డీఈఈ లిఖితపూర్వకంగా అప్పటి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో చెరువు నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

నిధుల ఖర్చుపై ఆరోపణలు

గౌసాబాద్ చెరువు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకముందే మంజూరైన నిధులు ఖర్చనైట్లు తెలిసింది. సీనియర్ రాజకీయ నాయకుల బంధువులకు కాంట్రాక్టు పనులు దక్కడంతో మొక్కుబడిగా పనులు చేపట్టి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్ధాంతరంగా ఉన్న చెరువు పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన అలుగు నిర్మాణ పనులు

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

గౌసాబాద్ చెరువు గురించి నాకు ఏమీ తెలియదు. నా హయాంలో ఎలాంటి పనులు జరగలేదు. కోర్టు కేసులు, నిధుల కొరత, ఇతర కారాణాలేమైన ఉన్నవన్న విషయం తెలియదు. అసంపూర్తిగా నిలిచిపోయిన చెరువు నిర్మాణం పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఆ తర్వాత చెరువు అభివృద్ధిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఉదయ్‌భాస్కర్, డీఈఈ, నీటిపారుదల శాఖ, జహీరాబాద్

కాలుష్యాన్ని నివారించండి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలో ఉన్న కాలుష్య పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించాలని ఖాజీపల్లి జేఏసీ కమిటీ చైర్మన్ దండె రమాకాంత్ డిమాండ్ చేశారు. కాలుష్య సమస్యను పరిష్కరించేవిధంగా పీసీబీ అధికారులు వెంటనే చర్యలు తీసుకునేవిధంగా చూడాలని గురువారం ఇంటింటికి వెళ్లి కాలుష్య నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ నూతన పద్ధతులతో కాలుష్యాన్ని నివారించేవిధంగా పరిశ్రమల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నివారణలో పీసీబీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. కాలుష్య సమస్యను పీసీబీ అధికారులకు తెలిపేవిధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చేలా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.

సాయిబాబాకు పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇశ్రితాబాద్ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకం అర్చనలు, పుష్పాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు చెక్కులు ఇస్తే చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అనర్హులకు చోటు కల్పిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల కిందట వివాహమైన వారికి, కర్ణాటకకు చెందినవారు ఆధార్ కార్డులో ఇక్కడి వివరాలు మార్చుకున్న వారికి లబ్ధి చేకూరినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటివి మనూరు, నాగల్‌గిద్ద, కంగ్టి మండలాల్లో ఎక్కువ జరిగాయని తెలిపారు. చెక్కుల కోసం లబ్ధిదారులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. కులం, ఆదాయం తదితర ధృవపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తన దృష్టికి తెచ్చారన్నారు. వారం రోజుల్లో ధృవపత్రాలను జారీ చేయాలని సూచించారు. నాగలిద్దాలో ధృవపత్రాల జారీకి కంప్యూటర్ ఆపరేటర్ రూ.2వేల నుంచి రూ.3 వేలు వసూలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, కౌన్సిలర్ వివేకానంద్, పండరిరెడ్డి, అవుటి శంకర్ ముదిరాజ్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

బాధ్యతతో పనిచేస్తేనే గుర్తింపు

కల్హేర్(నారాయణఖేడ్): అధికారులు బాధ్యతతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఎంపీపీ సుశీల అధ్యక్షతన గురువారం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటలసాగు నమోదు వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం, విద్య, తదితర శాఖల అధికారుల పని తీరుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పలువురు సభ్యులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీటీసీలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు అలీ, ఎంపీఓ ఘని, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

‘రావూస్’ గుర్తింపును రద్దు చేయండి

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్

సదాశివపేట(సంగారెడ్డి): ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్ జనరేట్ చేయనందునా రావూస్ పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. విద్యార్థులను ఇబ్బందులు గురిచేస్తున్న రావూస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాల యజమాన్యం 2022లో ప్రభుత్వ అనుమతి లేకున్నా విద్యార్థులను అడ్మిషన్ చేసుకున్నారన్నారు. కానీ.. ఈ పాఠశాలకు 2023లో ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 2022లో విద్యార్థిని సుప్రీత్‌ను 3వ తరగతిలో ఎందుకు అడ్మిషన్ చేశారని ప్రశ్నించారు. నాలుగో తరగతి వరకు రావూస్ పాఠశాలలోనే చదివిన అదే విద్యార్థికి వర్గల్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సీటు వచ్చిందని తెలిపారు. కానీ.. టీసీ, బోనాఫైడ్ ఇచ్చినా పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్ ఇవ్వకపోవడంతో గురుకుల పాఠశాలలో చేర్చుకోలేదని వాపోయారు. ఈ విషయంపై ఎంఈఓ శంకర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. పాఠశాల యజమాన్యం 10 రోజుల్లో పిన్ నంబర్(పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్)ఇస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు ప్రవీణ్‌రాజు, రమేష్, శివ, విద్యార్థి సుప్రిత్ తండ్రి సురేందర్ పాల్గొన్నారు.



రావూస్ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మహిళల అభ్యున్నతికి కృషి

సంగారెడ్డి టౌన్: ప్రతిఒక్కరూ మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని సంగారెడ్డి ఎస్‌ఐ నాగలక్ష్మి అన్నారు. జిల్లా శిశు సంక్షేమశాఖ మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టాలు, మహిళలు, బాలికలు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, మహిళ సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గడ్డపోతారం మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి అన్నారు. గడ్డపోతారం పంచాయతీ పరిధి.. కిష్టాయిపల్లిలో గంధంపార్కులో ఎన్విరాన్‌మెంట్ డే సందర్భంగా మొక్కలు నాటారు. గండి మైసమ్మలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులు సర్పంచ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈఓ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధి బాధ్యత నాదే

- అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల పూర్తికి కృషి
- అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. చైర్‌పర్సన్ అపర్ణ అధ్యక్షతన గురువారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివార్డులకు సమానంగా నిధులు కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.20 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటానని కౌన్సిలర్లకు హామీనిచ్చారు. కౌన్సిలర్ ఇలియాస్‌షరీఫ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధ అంటూ అధికారులు వీధి వ్యాపారులు, చిరువ్యాపారులకు జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ పరిశ్రమలపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. వాణిజ్య భవనాలకు ఎందుకు అస్తిపన్ను విధించడంలేదని కౌన్సిలర్ కుద్దుస్ ప్రశ్నించారు. 1వ వార్డులో రూ.25లక్షలతో చేపట్టేందుకు కేటాయించిన నిధులను అధికారులు దారి మళ్లించారని ఆరోపించారు. వీధికుక్కలను తరలించినట్లు అధికారులు రూ.9లక్షల బిల్లును ఎజెండాలో పెట్టారని, కనీసం 100 కుక్కలను కూడా తరలించలేదని కౌన్సిలర్ విశ్వనాథం వాపోయారు. కౌన్సిలర్ రవి మాట్లాడుతూ తన వార్డు పూర్తిగా వీకర్‌సెక్షన్‌లో ఉందని 35 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఇంటికి రెవెన్యూ విభాగం అధికారులు రూ.4 వేలు అస్తి పన్ను విధించారన్నారు. కౌన్సిలర్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ 130 అంశాలతో తయారు చేసిన ఏజెండాలో అవినీతి అక్రమాలు దాగి ఉన్నాయన్నాయని ఆరోపించారు. కౌన్సిలర్లు శివలక్ష్మి, రేణుక, నస్రీన్‌బేగం, రాజేశ్వరీ, రజియాబేగం తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ ఉమా, కౌన్సిలర్లు ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, మహేశ్వరీ, శ్రీనివాస్, అకుల శివ కుమార్, కోవూరి లక్ష్మీప్రసన్నగౌడ్, లలిత అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

సంగారెడ్డి: అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలతో క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసేవిధంగా కృషి చేయాలన్నారు. అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టాలని అక్రమ లేఅవుట్లనుఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరిరెడ్డి, జ్యోతి లక్ష్మి, లక్ష్మి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కనీస వేతనం ఇవ్వాలని ఆందోళన

సంగారెడ్డి : మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాజు సుగుణమ్మ నరసమ్మ ,సంగీత, శశికళ, వేణు, యాదగిరి, రాజు, సంగమేశ్వర్, లక్ష్మీనారాయణ, నరసింహులు, యాదయ్య, రాజేశ్వర్, నాగరాజు, నర్సింలు పాల్గొన్నారు

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ ఉమకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంజయ్య, రవి, బాల్‌రాజ్, శ్రీనివాస్, నర్సింలు, రాజు, దుర్గప్రసాద్, లక్ష్మి, మొగులమ్మ, రుక్కమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

జహీరాబాద్ టౌన్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్టు కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి, వర్కర్స్ యూనియన్ నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ తక్కువ వేతనం చెల్లిస్తుందని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కామయ్య, యశోదమ్మ, మోహన్, సంజీవ్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సంక్షిప్త వార్తలు

◆ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

నారాయణఖేడ్: సాంఘిక సంక్షేమ గురుకులంలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ జాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఖేడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. గురుకులం ప్రిన్సిపాల్ మీర్‌అలీ, లెక్చరర్లు భూపాల్‌రెడ్డి, కల్యాణి, సూర్యారావు, ఎల్లం పాల్గొన్నారు.

◆ బీహార్ వలస కూలీల పిల్లలకు బోధన

పుల్‌కల్(అందోల్): బీహార్‌కు చెందిన వలస కూలీల పిల్లలు చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓ వెంకటేశ్వర్లు పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. మండల పరిధిలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామంలోని ఎంఎస్ డిస్టిలరీ పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్ వలస కూలీల పిల్లలకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు మాతృ భాష బోధించే ఉపాధ్యాయుడిని నియమించాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు. ఎంఈఓ శంకర్, క్లస్టర్ హెచ్‌ఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

◆ విరాళం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న జీవన జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణానికి బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి గురువారం రూ.21వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విరాళాన్ని అందించిన జగన్‌రెడ్డికి ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంగారెడ్డి టౌన్: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో భిక్షాటన చేసుకుంటూ మహిళ రేకుల షెడ్డులో ఉంటూ జీవనం కొనసాగిస్తోంది. ఉదయం మృతి చెందడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ ఘనంగా రామాలయ వార్షికోత్సవం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలోని రామమందిరం ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.